క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో అభయాంజనేయ స్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం అభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించగ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకిసేవ నిర్వహించారు.

ఆలయానికి టీవీ బహూకరణ



టీవీ అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి దాతలు మంగళవారం టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన రామిశెట్టి పెంచలయ్య – పెంచలమ్మ దంపతులు, వారి కుమార్తె ప్రమీల ఆలయానికి రూ.27 వేల విలువ చేసే 4కే ఎల్‌ఈడీ టీవీని అందజేశారని తెలిపారు. ఈ టీవీని ఆలయ ఆవరణలో ఏర్పాటు చేయబోయే సీసీ కెమెరాలకు అనుసంధానం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రమాబాయికి ఘన నివాళి



బుచ్చిరెడ్డిపాళెం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దళిత నాయకులు మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేడ్కర్ భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమతాటి వెంకటరమణయ్య, తిరుపాలు, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, కిరణ్, నరేష్, శ్రీనివాసులు, సందీప్, వినోద్, భరత్, కార్తీక్, మనోహర్, చెంచయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి



బుచ్చిరెడ్డిపాళెం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 18వ వార్డు కౌన్సిలర్ మోర్ల జయంతి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె బుచ్చిరెడ్డిపాళెంలోని తన వార్డు పరిధిలో పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌కుమార్, పెంచలయ్య ఉన్నారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని నమ్మించి రూ.40 లక్షలను కాజేసిన ఘటనలో చిన్నబజార్ పోలీసులు చీటింగ్ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఫతేఖాన్‌పేటలోని అరిగెలవారివీధికి చెందిన రామయ్య.. వైఎస్సార్ జిల్లాకు చెందిన సుబ్బరాయుడు, మహబూబ్ అలీ కన్సల్టేషన్ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. మినీబైపాస్‌లో శకుంతలమ్మకు సంబంధించిన స్థలాన్ని తాము అగ్రిమెంట్ చేసుకున్నామని, అందులో కొంత ఇస్తామంటూ రామయ్య వద్ద రూ.40 లక్షలను తీసుకున్నారు. అగ్రిమెంట్ పత్రాలను రామయ్యకు ఇచ్చారు. కొద్ది రోజుల అనంతరం అగ్రిమెంట్ పత్రాలను ఇస్తే బ్యాంక్ లోను తీసుకుంటామని రామయ్యను నమ్మించి తీసుకున్నారు. అప్పటి నుంచి నగదు ఇవ్వకుండా నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యాల సాగు ఎంతో మేలు

• జిల్లా వ్యవసాయాధికారి సుధాకరరాజు



ముత్తుకూరు: వల్లూరులో డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ ప్రక్రియను ప్రారంభిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: చిరుధాన్యాల సాగు ఎంతో మేలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు అన్నారు. మండలంలోని వల్లూరులో మంగళవారం నానో యూరియా వినియోగం, డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీ, చిరుధాన్యాల సాగు తదితర అంశాలపై జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయం రైతులకు గుర్తుచేశారు. పంట నమోదు ప్రక్రియ సక్రమంగా చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదును సూపర్ చెక్ చేసుకోవాలన్నారు. నెల్లూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వనిత, కేవీకే శాస్త్రవేత్త శివజ్యోతి మాట్లాడుతూ వివిధ రకాల చిరుధాన్యాల సాగు విధానంపై విపులంగా వివరించారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పురుగుమందులను డ్రోన్ల ద్వారా ఎలా పిచికారీ చేయాలో వివరించారు. ఇఫ్కో స్టేట్ డైరెక్టర్ శ్రీధర్, టెక్నికల్ వ్యవసాయాధికారి రాధ, మండల వ్యవసాయాధికారి జోత్స్నారాణి, హార్టికల్చర్ యూనివర్సిటీ సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పెంచల ప్రతాప్, రైతు చెంగారెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి

బుచ్చిరెడ్డిపాళెం: మహిళా రైతులు చిరు ధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని జిల్లా ఏరువాక(డాట్) కోఆర్డినేటర్ డాక్టర్ ఓబయ్య, ఆత్మ డీడీపీ శివనారాయణ సూచించారు. మండలంలోని రామచంద్రాపురంలో మంగళవారం ఆత్మ వ్యవసాయ సాంకేతిక సంస్థ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జి–20, మహిళా స్వావలంబన, అభివృద్ధి, సాధికారతపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సాగు సంవత్సరంగా ప్రకటించారని తెలిపారు. ఇందులో భాగంగా ముఖ్యంగా మహిళా రైతులు చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఆరిక, సామలు, అరిగ, ఊదర్లు, అండుకొర్రలు తదితర పంటలను సాగు చేసేందుకు మన ప్రాంతం అనుకూలమన్నారు. వీటి సాగుకు పెట్టుబడులు, నీటి వినియోగం తక్కువని తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ పంటల సాగు అనివార్యమైందన్నారు. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు మారుతీదేవి, సుజాత, ఏఓలు మధురిమ, సురేంద్రరెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, విస్తరణాధికారులు మీరయ్య, శ్రీలత పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: చిరుధాన్యాల సాగుపై వివరిస్తున్న ఆత్మ డీడీఏ శివనారాయణ

మల్లికార్జునస్వామి ఆలయానికి తుదిమెరుగులు



నిర్మాణం పూర్తవుతున్న మల్లికార్జునస్వామి ఆలయం

పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామంలో పునర్నిర్మిస్తున్న మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వాహకులు పనులు చేపడుతున్నారు. దాతల సహకారంతో సుమారు రూ.1.50 కోట్లతో శివాలయాన్ని నిర్మిస్తున్నట్లు వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామపెద్దలు ముందుకువచ్చి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. త్వరలో పనులను పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నారు.

నేడు రామదాసుకండ్రిగలో 'గడప గడపకు..'

వెంకటాచలం: మండలంలోని రామదాసు కండ్రిగ గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య మంగళవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని, ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని తెలిపారు.

బంగారు నెక్లెస్ చోరీ

నెల్లూరు(క్రైమ్): వివాహ వేడుకల్లో బంగారు నెక్లెస్‌ను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసి పరారైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లోని కృష్ణ మందిర సమీపంలో నివాసం ఉంటున్న వెంగయ్య స్థానికంగా సిమెంట్, స్టీల్ షాపును నిర్వహిస్తున్నారు. ఆయన పెద్ద కుమార్తె వివాహాన్ని పురస్కరించుకొని తన కుటుంబసభ్యులతో కలిసి పిచ్చిరెడ్డి కల్యాణ మండపానికి ఈ నెల రెండున వెళ్లారు. ఈ క్రమంలో వధువు రూమ్‌లోకి గుర్తుతెలియని దుండగుడు ప్రవేశించి డబ్బాలో ఉన్న 45 గ్రాముల బంగారు నెక్లెస్‌ను అపహరించారు. గమనించిన వెంగయ్య భార్య కేకలేశారు. అప్పటికే దుండగుడు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య తెలిపారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన అశ్విని వేదాయపాళెంలోని సుస్మిత నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ తొలి సంవత్సరం చదువుతూ అక్కడి హాస్టల్లో ఉంటున్నారు. ఈ నెల ఐదో తేదీన ఆమె తల్లి అరుణ హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి కుమార్తెను ఇంటికి పంపాలని కోరారు. ఈ క్రమంలో అశ్విని తన తల్లికి ఫోన్ చేసి ఎంజీబీ మాల్లో ఉన్నానని, తర్వాత వస్తానని చెప్పారు. రాత్రయినా కుమార్తె రాకపోవడం.. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని రావడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో వాహనచోదకులు గాయపడ్డారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండలం వేగూరుకు చెందిన మామాఅల్లుడు శీనయ్య, ఏడుకొండలు పెయింట్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. నెల్లూరు నుంచి జాతీయ రహదారి మీదుగా ఇంటికి వీరు బయల్దేరారు. భగత్‌సింగ్‌కాలనీ వద్దకు వచ్చేసరికి గూడూరు వైపు నుంచి వస్తున్న కారు మితిమీరిన వేగంతో బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ఘటనలో శీనయ్య తలకు తీవ్రగాయాలు కాగా, ఏడుకొండలు స్వల్పంగా గాయపడ్డారు. శీనయ్యను 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించడమే ధ్యేయం

• ఆర్‌జేడీ సుబ్బారావు



మనుబోలు: మాట్లాడుతున్న ఆర్‌జేడీ సుబ్బారావు

మనుబోలు: పదో తరగతిలో జిల్లాలో నూరుశాతం ఫలితాలు సాధించడమే ధ్యేయమని విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యాప్రమాణాలపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక సారిస్తారని తెలిపారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక చదువుపై శ్రద్ధ పెట్టేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ఇందుకోసం స్టడీ మెటీరియల్ అందజేశామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేసిందని, వీటిని రోజూ వినియోగించేలా సూచనలిచ్చామని తెలిపారు. విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే తినేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ శేషాద్రివాసు, హెచ్‌ఎం డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన

కోవూరు: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.వి.సుబ్బారావు తెలిపారు. స్థానిక టీఎన్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థుల పట్ల చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్రంలో సొంత వెబ్‌సైట్ కలిగిన కళాశాల టీఎన్‌సీ అని తెలిపారు. ఇంటర్ తరువాత ఏం చేయాలి.. ఏఏ కోర్సుల్లో చేరాలన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట డీవీఈఓ మధుబాబు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కే సికిందర్, అధ్యాపకులు ఉన్నారు.

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి అమెరికాలో ఉంటున్న నేరెళ్ల కిరణ్‌కుమార్, శ్రీదివ్య, అక్షయ్య, కృతిక ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రత్యూష

ముత్తుకూరు: ఇళ్లలో వెలువడే చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ ప్రత్యూష సూచించారు. మండలంలోని పిడతాపోలూరు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద మంగళవారం ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను ఎలా సక్రమంగా నిర్వహించాలన్న అంశంపై జిల్లాలో నాలుగు లోకల్ ట్రెనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఆత్మకూరు, కావలి, కోవూరు, పిడతాపోలూరు సెంటర్ల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేర్చుకొన్న అంశాలను ఆయా మండలాల్లో సిబ్బందికి అవగాహన కల్పిస్తారని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, ఈఓపీఆర్‌డీ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు

తోటపల్లిగూడూరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు ఎంపీడీఓ హేమలత తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది, సామాజిక తనిఖీ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ఉపాధి హామీ పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకం, దాని అనుబంధంతో వివిధ శాఖల ద్వారా ఏడాది నుంచి జరిగిన పనుల తీరుతెన్నులపై సామాజిక తనిఖీ అధికారులు నివేదికలు అందించాల్సి ఉందన్నారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్‌రావు, అడిషనల్ పీడీ శ్రీహరిరెడ్డి, పీఆర్ ఏఈలు శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్, ఏపీఓ అచ్చయ్య, ఈసీ రమేష్, జేఈ సీసీలు రమణ, శ్రీనివాసులు, సిబ్బంది కొండలరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బైక్‌ను ఆటో ఢీకొని..

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరానికి చెందిన అశోక్, కరిముల్లా పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళతుండగా కసుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్, కరిముల్లాలకు గాయాలు కాగా స్థానికులు గమనించి వారిని చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట నమోదు పక్కాగా జరగాలి

• జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



కమ్మపాళెంలో పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

కొడవలూరు: పంట నమోదు ప్రక్రియ పక్కాగా జరగాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు. మండలంలోని కమ్మపాళెంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను మంగళవారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్ చెక్ రికార్డుల్లోని నమోదు వివరాలను, క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. పంట నమోదులో వ్యవసాయ సిబ్బంది చూపుతున్న చొరవ పట్ల రైతులు జేసీ ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జేసీ మట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు అన్ని జాగ్రత్తలు తీసుకొని పంట నమోదు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా రైతులు కూడా పంట నమోదు పట్ల ఆసక్తి కనబరచి అందుబాటులో ఉండి పంట నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూసుకోవాలని తెలిపారు. ఇప్పటికే పంట నమోదు పూర్తయిన రైతులు ఆర్బీకేల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు అనంతరం ఈకేవైసీ కూడా పూర్తి చేసుకొన్న రైతులే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు అర్హులవుతారని తెలిపారు. జేసీ వెంట తహసీల్దార్ రమాదేవి, ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, డీటీ గున్నం మల్లికార్జున, మండల సర్వేయర్ మహబూబ్‌బాషా, వీఆర్వో సుమంత్, వీఏఏ ఒ.సుజిత్ ఉన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



రామన్నపాళెంలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ తదితరులు

కొడవలూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో ఉన్న జగనన్న లేఅవుట్‌ను మంగళవారం హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇక్కడి లేఅవుట్‌లో 23 గృహాలు మంజూరు చేయగా, 17 గృహాల నిర్మాణాలు ప్రారంభించగా వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మాణాలు ప్రారంభించని గృహాలకు సంబంధించి ఎంపీడీఓ లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. వివిధ దశల్లో ఉన్న గృహాలన్నింటినీ ఉగాది నాటికి పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలన్నారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నందున నిర్మాణాలు ప్రారంభించి త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు



కోవూరు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోవూరు: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు బానిస కాకుండా వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి సూచించారు. ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశాల మేరకు మండలంలోని గంగవరం గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మంగళవారం యాంటీ డ్రంక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగించడం ద్వారా విద్యార్థి భవిష్యత్ అంధకారంలోకి వెళుతుందన్నారు. కొందరు మత్తుపదార్థాలకు బానిసై వారి జీవితాన్ని ఏ విధంగా నాశనం చేసుకొంటున్నారో వివరించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ

ఇందుకూరుపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఈబీ సీఐ ఎం.బాలకృష్ణ సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని ముదివర్తిపాళెం, కొమరిక గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను కుటుంబసభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల వారు ఈ మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం వాటికి జోలికి వెళ్లబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ముత్తుకూరు: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ముత్తుకూరులో నిర్వహించిన మానవహారం

ముత్తుకూరు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి సూచించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మంగళవారం ముత్తుకూరులో పోలీసుస్టేషన్ వద్ద నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ విద్యార్థుల వివరాల సేకరణ



డీఏవీ స్కూల్‌లో వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయ బృందం

ముత్తుకూరు: ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ చదివే విద్యార్థుల వివరాలు సేకరించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ముత్తుకూరు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చెంచురామయ్య, సంయుక్త కార్యదర్శి రాజగోపాల్ తదితరులు ఒక బృందంగా ఏర్పడి, మండలంలోని పలు ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసి విద్యార్థుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ చదివే విద్యార్థుల వివరాలను వెంటనే చైల్డ్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టే సంస్కరణలకు ఈ వివరాలు ఉపకరిస్తాయని తెలిపారు.

చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలి

కొడవలూరు: ప్రీప్రైమరీ విద్యార్థులను చైల్డ్ ఇన్ఫోలో విధిగా నమోదు చేయాలని ఎంఈఓ జి.వసంతకుమారి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న సరస్వతి, గండవరం సెయింట్ మేరీస్ పాఠశాలలను చైల్డ్ ఇన్ఫో పరిశీలనా బృందంతో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందానికి పలు సూచనలిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీలో భాగమైన ప్లేక్లాస్, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులను సైతం విధిగా చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అక్కిరెడ్డి, ఓబులేసు, లక్ష్మీప్రసూన, ప్రిన్స్, సీఆర్‌పీ సురేష్ పాల్గొన్నారు.